వర్షం కురిసే.. రైతు మురిసే


పంట పొలంలో సాళ్లు తోలుతున్న రైతు, విత్తనాలు వెదపెడుతున్న కూలీలు


పొలంలో పత్తి విత్తనాలు వేస్తున్న కూలీలు

వ్యవసాయ పనులలో నిమగ్నమైన రైతులు

రెంటచింతల: వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా మండలంలోని వివిధ గ్రామాలలో కొద్ది రోజులుగా చిరు జల్లులు పడుతుండటంతో రైతులు వ్యవసాయ పనులలో పూర్తిగా నిమగ్నమయ్యారు. జూన్ నెలలో 58 మి.మీ.లకు గాను 23 మి.మీ.లు, జూలైలో 114 మి.మీ.లకు గాను ఇప్పటికే 30 మి.మీ.లు వర్షపాతం నమోదైనట్లు మండల వాతావరణ శాఖ సూపర్‌వైజర్ బద్దిగం ఈశ్వర్‌రెడ్డి వెల్లడించారు. జూలై నెలలో ఇప్పటి వరకు సకాలంలో చిన్నపాటి వర్షాలు కురవడంతో మండలంలోని వివిధ గ్రామాలలో రైతులు పూర్తిస్థాయిలో వ్యవసాయ పనులలో నిమగ్నమయ్యారు. పత్తి విత్తనాలు వేసే పనులు, వరి దమ్ము చేసే పనులు, సాళ్లు తోలే పనులతో పంటల సాగుకు పొలం సిద్ధం రైతులు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో మండలంలో సాగు భూమి 10,358 హెక్టార్లు ఉండగా.. మిర్చి 4,686 హెక్టార్లలో సాగు చేస్తుండగా, పత్తి 3,274 హెక్టార్లలో వేయడం జరిగిందన్నారు. వరి 1,862 హెక్టార్లలో, అపరాలు 536 హెక్టార్లలో ఈ ఏడాది సాగు చేయనున్నారని అంచనా వేయడం జరిగిందని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. ప్రస్తుతం ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాల వలన కృష్ణా జలాలు శ్రీశైలం ప్రాజెక్టుకు వస్తుండటంతో ఈ ప్రాంత రైతులలో సంతోషం వెల్లివిరుస్తుంది.

ఈ వర్షాలు సాగుకు అనుకూలం



ప్రస్తుతం అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు పంటలు సాగు చేసుకునేందుకు అనుకూలంగా ఉన్నాయి. గ్రామాలలో రైతులు సాళ్లు తోలుతూ మిర్చి విత్తనం వెదపట్టే పనులు, పత్తి పంటను వేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా రైతులు హైబ్రిడ్ మిర్చి మొక్కలను కొనుగోలు చేసి సాగు చేస్తుంటారు. ఆగస్టు, సెప్టెంబర్ వరకు కూడా మిర్చి మొక్కలను వేసేందుకు సమయం ఉంటుంది.

– పులి ఓబుల్‌రెడ్డి, రైతు, రెంటచింతల

అధికారుల సూచనలతో సాగు చేయాలి



మండలంలోని వివిధ గ్రామాలలో ఈ ఖరీఫ్ సీజన్‌లో పలు రకాల పంటలను సాగు చేసే రైతులు వ్యవసాయ అధికారుల సూచనలతో సాగు చేయడం వలన ప్రయోజనం పొందవచ్చు. ప్రస్తుతం మిర్చి సాళ్లు పోసుకునేందుకు అనుకూలం. అక్కడక్కడ పత్తి విత్తనాలను రైతులు వేసుకుంటున్నారు. హైబ్రిడ్ మిర్చి మొక్కలను ఆగస్టు, సెప్టెంబర్ వరకు నాటుకోవచ్చు. ఆగస్టు మొదటి రెండు వారాల్లో కంది పంటను సాగు చేసుకోవడానికి అనుకూలం.

– బోయపాటి బ్రహ్మారెడ్డి, ఏవో, రెంటచింతల

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

పాలువాయి(రెంటచింతల): 18 సంవత్సరాలు నిండకుండా బాలబాలికలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని గోలి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వి.ప్రదీప్‌కుమార్, మండల ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. బుధవారం మండలంలోని పాలువాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మిషన్ శక్తి భారతీయ న్యాయ సంహిత వారిచే నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలు ప్రోత్సహించడం అంటే బాలల హక్కులను హరించడమేనన్నారు. భారతీయ న్యాయ సంహితలో మహిళలు, బాలబాలికల సంరక్షణ కోసం రూపొందించిన చట్టాలపై అవగాహన కల్పించేందుకు 100 రోజుల పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం సమాజంలో స్త్రీలపై దాడులు, సామూహిక అత్యాచారాలు, వరకట్న వేధింపులు, పిల్లలపై జరిగే నేరాలకు సంబంధించి రూపొందించిన నూతన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు.. వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రక్తహీనత లేని సమాజాన్ని రూపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని.. రక్తహీనతను అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌కేలు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.


పాలువాయి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్

ఘనంగా జాషువ వర్ధంతి వేడుకలు


జాషువ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

రెంటచింతల: స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువ వర్ధంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.మోహన్, హనుమంత్ ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ జాషువ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. పల్నాడు జిల్లా వినుకుండ నియోజకవర్గం చాట్రగడ్డపాడులో ఓ దళిత కుటుంబంలో జన్మించిన గుర్రం జాషువ చిన్నతనం నుంచి మతోన్మాదుల కన్నెరకు గురయ్యారని, ఆయన అనుభవించిన అన్యాయాలు, అసమానతలను కవితా వస్తువులుగా మలచి గొప్ప కావ్యాలను రచించారన్నారు. దేశభక్తిని, జాతీయ వాదాన్ని ప్రబోధిస్తూ ఆయన చేసిన రచనలకు పౌర సన్మానాలు, బిరుదులను పొందారన్నారు. వీరి క్రీస్తు చరిత్రకు కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి, పద్మ భూషణ్, కళాప్రపూర్ణతోపాటు కవికోకిల, కవితా విశారద, నవయుగ కవి చక్రవర్తి వంటి బిరుదులు అందుకున్నారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనమండలి సభ్యునిగా సేవలను అందించారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గాదె లూర్దు మర్రెడ్డి, పూజల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో...

పిడుగురాళ్ల: గుర్రం జాషువా వర్ధంతిని పిడుగురాళ్ల పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో గుర్రం జాషువా విగ్రహం వద్ద బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకట్రావు మాట్లాడుతూ... గుర్రం జాషువా పల్నాడు జిల్లా వినుకొండ గ్రామంలో జన్మించారని.. ఆయన ఎన్నో కావ్యాలు రాసి అనేక బిరుదులు పొందారని తెలియజేశారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో రేడియో ప్రచారకుడిగా విధులు కొనసాగించారని, తుది శ్వాస గుంటూరులో విడిచారని, ఇలాంటి గొప్ప కవి జిల్లాలో జన్మించటం పల్నాడు జిల్లాకే గర్వకారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గుర్రం జాషువా సమితి అధ్యక్షులు చల్లగుండ్ల సంతోషరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు రామ ఇస్రాయేలు, మీసాల బాబు, చంద్రపాటి నాగేశ్వరరావు, డేగల అబ్రహాం, బీసుపోగు సాగర్, కొమ్ము మరియదాసు, మందా యేసోబు, మల్లవరపు రాఘవ, బుర్ర ఆదాం, రాయపాటి హనుమంతరావు, ఆదాం, మంతంగి సునీల్, లక్ష్మణరావు, వర్లా రత్నం, నల్లాటి సుబ్బారావు, గుండాల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


జాషువా విగ్రహానికి పూలమాల వేస్తున్న సీఐ వెంకట్రావు

ఉపకరణాలు పంపిణీ

రాజుపాలెం: మండలంలోని మొక్కపాడులో 29 మంది దివ్యాంగులకు నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రామ్ క్రింద ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ వెంకటకృష్ణకుమార్, సర్పంచ్ పద్మలు బుధవారం ఉపకరణాలను అందించారు. నడుము నొప్పి కలిగిన 17 మందికి బెల్టులు, 11 మందికి చేతి కర్రలు, ఒక్కరికి మెడ బెల్టును అందించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, కమ్యూనిటీ హెల్త్ అధికారి శివమాధవి, ఏఎన్ఎం నాగలక్ష్మి, సాధిక్ హుస్సేన్, ఆశా కార్యకర్తలు పద్మావతి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

అనంతవరంలో...

అనంతవరం(క్రోసూరు): క్రోసూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సిరి చందన ఆధ్వర్యంలో ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ చేతుల మీదుగా బుధవారం మండలంలోని అనంతవరం గ్రామంలో ఫ్లోరోసిస్ బాధితులకు మెడికల్ ఎయిడ్ కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. స్థానిక ఆరోగ్య ఉపకేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో 96 మందికి కిట్లు అందజేశారు. నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ ఫ్లోరోసిస్ కార్యక్రమంలో భాగంగా మెడ, నడుము నొప్పి ఉన్నవారికి, నడవలేని వారికి ఫ్లోరోసిస్ మెడికల్ ఎయిడ్ కిట్ల పరికరాలు వాకింగ్ స్టిక్స్, లంబర్ బెల్ట్‌లు, నెక్ బెల్టులు ప్రభుత్వం ఉచితంగా అందజేసింది. ఆరోగ్య కార్యకర్తలు డీవీ పద్మ, ఫ్రాంక్లిన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు .


మొక్కపాడులో ఉపకరణాలు అందిస్తున్న దృశ్యం

జాషువా ఆశయాలు సాధించాలి

ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి : నవయుగ కవి చక్రవర్తి, పద్మభూషణ్ గుర్రం జాషువా ఆశయాలు సాధించాలని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. పల్నాడు బలహీనవర్గాల సమాఖ్య ఆధ్వర్యంలో జాషువా వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. జాషువా విగ్రహానికి జంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన కవిత్వాల ద్వారా జాషువా సమాజాన్ని మేలుకొపారని, జాషువా కవిత్వాలు ప్రజలను చైతన్యవంతులను చేసాయని జంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ షరీఫ్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, మాజీ జెడ్పీటీసీ భూషణం చెన్నయ్య, నాయకులు గద్దల వేదమణి, బత్తుల వెంకయ్య, మాశెట్టి బుజ్జి, మందా బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అమృత వర్షోత్సవాలు

మాచర్ల : బ్రహ్మర్షి సద్గురు ముసలయార్య స్వామి వారి 135వ జయంతి సందర్భంగా 75వ అమృత వర్షోత్సవ ఆరాధన మహోత్సవాల ముగింపు వేడుకలు మంగళవారం రాత్రి వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలోని జ్ఞానాశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 75వ ఆరాధన, పూర్ణాహుతి కార్యక్రమాలు జ్ఞానాశ్రమ నిర్వాహకులు గురు బ్రహ్మశ్రీలు పందిరి శ్రీశైలం, కాశీవిశ్వనాథ్ స్వామీజీల ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని బ్రహ్మర్షి సద్గురు ముసలయార్య స్వామి వారి ఆశీస్సులతో నిత్యం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అన్నారు. పల్నాడు ప్రాంతం సుభిక్షంగా ఉండాలని కోరిన మహనీయులు స్వామి ముసలయార్య వారని తెలిపారు. ఆయన పేరుతో జ్ఞానాశ్రమాన్ని గుండ్లపాడులో ఏర్పాటు చేసి సేవ చేయడం తమ అదృష్టమని అన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పశువులకు టీకాలు



దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు పశువైద్యశాలలో ఆవులకు లంపీస్కిన్ వ్యాధి నివారణ వ్యాక్సిన్ వేసే కార్యక్రమం మండల పశువైద్యుడు డాక్టర్ మల్లయ్య ఆధ్వర్యంలో జరిగింది. బుధవారం వరకు 1600 తెల్ల పశువులకు వ్యాక్సిన్ వేసినట్లు వైద్యులు తెలిపారు. మొత్తం 2200 తెల్ల పశువులకు ఈ వ్యాక్సిన్ వేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. పాడి రైతులు, గోపాల మిత్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేద్దాం

అచ్చంపేట: ఇదే పాఠశాలలో విద్యనభ్యశించి వివిధ హోదాలలో ఉన్నతస్థానంలో ఉన్న పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి తోడ్పాటునందించాలని స్థానిక టీఎస్సార్ జడ్పీ హైస్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాసమూర్తి అన్నారు. జడ్పీ స్కూలు ఆవరణలో బుధవారం జరిగిన పూర్వవిద్యార్థుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ యేడాది నుంచి పాఠశాలలో టెన్త్ క్లాస్ విద్యార్థులకు ప్రారంభమైన సీబీఎస్ఈ సిలబస్‌కు అనుగుణమైన మోడల్ పేపర్స్‌ను తెప్పించి ఇచ్చినట్లయితే ఇప్పటినుంచే తర్ఫీదు పొంది ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉందన్నారు. మధ్యాహ్న భోజనశాల ప్లాట్‌ఫాంపై రేకుల షెడ్డు నిర్మించేందుకు 1998–99 బ్యాచ్ 10వతరగతి విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. పాఠశాల వజ్రోత్సవ కార్యక్రమాన్ని వచ్చే యేడాది జూన్‌లో నిర్వహించేందుకు పూర్వ విద్యార్థులంతా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా సావనీర్‌ను తయారుచేసే బాధ్యతను పూర్వవిద్యార్థి గనుపల్లి సతీష్‌బాబుకు అప్పగించారు. సంఘం కార్యదర్శి పాపిరెడ్డి, శిఖా ప్రకాష్, సూరే సంపత్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పత్తి సాగు పరిశీలన



పిడుగురాళ్ల: మండలంలోని కామేపల్లి గ్రామంలో అధిక వర్షాలకు గురైన పత్తి పొలాలను బుధవారం మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ ఉద్యాన సహాయకులు కరిముల్లా పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ... కొంచెం తేమ ఆరిన తర్వాత ఎకరాకు 50 కిలోల డీఏపీ, 50 కిలోల యూరియా, 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను పొలంలో ఎదపెట్టుకోవాలని తెలిపారు. రసం పీల్చే పురుగు, పేనుబంక నివారణకు కాండానికి మందు పూసే పద్ధతిలో మోనో ప్రోటోపాస్ 100 మిల్లీ లీటర్ల మందును 400 మిల్లీ లీటర్ల నీటిలో కలిపిన మందు ద్రావణంను పత్తి మొక్కల కాండం మధ్య భాగంలో పెట్టుకుంటూ పోవాలి. ఈ పద్ధతిని పత్తి నాటిన 30 రోజులకు, 45 రోజులకు, 60 రోజులకు పాటించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ ధర్నాలో పాల్గొన్న మేరాజోత్ హనుమంత్‌నాయక్

మాచర్ల: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధిని గాలికొదిలేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులపై దాడులు చేస్తూ హత్యలు, ఆత్మహత్యల ప్రేరణ, అత్యాచారాలకు పాల్పడడం హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్‌నాయక్ అన్నారు. బుధవారం ఆయన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీలో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అరాచకాలను తొమ్మిది జాతీయ పార్టీలు మద్దతు తెలిపి ఖండించాయన్నారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ నుంచి ఫోన్‌లో మాట్లాడారు.

వీధి కుక్కలకు రాబిస్ వ్యాక్సిన్



మాచర్ల : పట్టణంలో జెండా చెట్టు సెంటర్, పశువుల హాస్పిటల్ బజార్, పలు ప్రాంతాల్లో వీధి కుక్కలకు రాబిస్ వ్యాక్సిన్‌ను బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకట దాస్ ఆధ్వర్యంలో వెటర్నరీ వైద్యులు వేశారు. పెంపుడు కుక్కలకు కచ్చితంగా వ్యాక్సిన్ వేయించాలని వెటర్నరీ డాక్టర్ ఇ.జగదీష్ సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం, బ్యాగ్‌లు పంపిణీ



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ పరిధిలోని సుందరయ్య కాలనీలో దీనమ్మ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వహిస్తున్న యరపతినేని లక్ష్మయ్య మెమోరియల్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, బ్యాగ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమానికి దీనమ్మ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ గరికపాటి శంకర్‌రావు, పీఎస్ఆర్ డిగ్రీ కాలేజీ డైరెక్టర్ కోనేటి నరసింహారావు, ప్రధానోపాధ్యాయులు జె.ఆల్‌ఫ్రెడ్, ఉపాధ్యాయలు శ్రీహరి, జాషువా, వలంటీర్ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

నకరికల్లు: విద్యారంగంలో దాతల సహకారం మరువలేనిదని హెచ్ఎం కె.మేరీరాణి అన్నారు. మండలంలోని కుంకలగుంట గ్రామంలోని ఉన్నతపాఠశాలలో విద్యార్థుల మధ్యాహ్నభోజనం కోసం ప్లేట్లు, గ్లాసులను కోనా రామచంద్రయ్య /ాపకార్థం బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం కె.మేరీరాణి మాట్లాడుతూ 100 భోజనం ప్లేట్లు అందించిన దాతలు నారాయణరావు, పసుపులేటి అంజమ్మ, పసుపులేటి చౌడయ్యలను అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

380 మందికి కంటి పరీక్షలు

హసనాబాద్(క్రోసూరు): మండలంలోని హసనాబాద్ గ్రామ జెడ్పీ పాఠశాలలో మాగులూరి ఫౌండేషన్ అధ్యక్షుడు ఎన్ఆర్ఐ మాగులూరి భానుప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ బాలకృష్ణ ప్రారంభించారు. శిబిరంలో 380 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 63 మందికి కంటి ఆపరేషన్లకు సిఫార్సు చేశారు. మిగిలినవారికి కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు కుంచనపల్లి కిరణ్, బండారుపల్లి సిద్ధయ్య, మాగులూరి అరుణ, మన్నెం శ్రీనివాసరావు, అనుముల వెంకట్రామిరెడ్డి, వెంకట్రావు, గ్రామ పెద్దలు షేక్ అబ్దుల్, షేక్ అజీజ్, షేక్ జిలాల్, బాషా పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగపర్చుకోండి


కంభంపాడులో ఆధార్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో సరోజనీదేవి


ఆధార్ సీడింగ్ కేంద్రంలో మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్

మాచర్ల రూరల్: నూతనంగా ఆధార్ కార్డు పొందేందుకు, ఆధార్ అప్‌డేట్ చేయించుకునేందుకు ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్లను ప్రజలు సద్వినియోగ పర్చుకోవాలని ఎంపీడీవో కె.సరోజనీదేవి అన్నారు. బుధవారం మండలంలోని కంభంపాడు గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను ఆమె పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. ఈ ఆధార్ క్యాంపు ద్వారా పిల్లలకు నూతనంగా ఆధార్ నమోదు చేయటం, వేలిముద్రలు పడని వారికి అప్‌డేట్ చేయటం, అడ్రస్సు మార్పుతో పాటు ఫోన్ నంబర్ లింకు, డేట్ ఆఫ్ బర్త్ తదితర మార్పులు, చేర్పులు చేయించుకోవచ్చని చెప్పారు. ప్రజలు ఈ ఆధార్ కార్డు క్యాంపులను సద్వినియోగ పర్చుకోవాలని కోరారు. ఆమె వెంట ఈవోపీఆర్‌డీ కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి బిట్టు వెంకటేశ్వర్లు, వీఆర్వో జలీల్, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకయ్య, సర్వేయర్ భాను కిరణ్, డిజిటల్ అసిస్టెంట్ మాధవి, ప్రజలు పాల్గొన్నారు.

ఆధార్ సీడింగ్ కేంద్రాల పరిశీలన

సచివాలయ సిబ్బంది ఏర్పాటు చేసిన ఆధార్ అప్‌డేట్ కేంద్రాలను ప్రజలు వినియోగించుకున్నారు. ఆధార్ కార్డు కేంద్రాల నిర్వాహకులపై ప్రజలకు సేవలు అందించాల్సిన బాధ్యత ఉందని మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్ అన్నారు. పట్టణంలోని తూర్పుబావి, సుద్దగుంతల ప్రాంతాల్లో ఉన్న సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ సీడింగ్ కేంద్రాలను బుధవారం కమిషనర్ సందర్శించారు. ఆధార్ అప్‌డేట్, నమోదు ప్రక్రియ, సాంకేతికంగా ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై ఆయన సచివాలయ సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. మరో మూడు రోజులపాటు జరిగే ఆధార్ సీడింగ్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి

మాచర్ల : పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్ పరిశీలించారు. ఆయా సచివాలయ పారిశుద్ధ్య పర్యవేక్షకులు, ఏఈలు తేజ, చంద్రశేఖర్‌లతో కలిసి పలు వార్డుల్లో పర్యటించారు. పారిశుద్ధ్య పనులు ఏ విధంగా కొనసాగుతున్నాయో పరిశీలించారు. పారిశుద్ధ్య లోపంతో రోగాలు ప్రబలే అవకాశం ఉందని.. ప్రజల వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. దోమలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. చెత్త పేరుకుపోయిన ప్రదేశాలు గుర్తించి పారిశుద్ధ్య కార్మికులను పిలిపించి వెంటనే శుభ్రం చేయించారు. అనంతరం పురపాలక సంఘ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయాల పారిశుద్ధ్య కార్మికులతో సమీక్షించారు. పట్టణంలో ఎక్కడా అపరిశుభ్రమైన వాతావరణం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్

చినుకు పడితే అంతే ...!



గత కొంతకాలంగా అధ్వాన్నంగా ఉన్న రోడ్డును బాగుచేసి పాదచారులకు, వాహనదారులకు ఇబ్బంది లేకుండా చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు. ఎన్నోసార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు తెలియపరిచినా పట్టించుకోని పరిస్థితి. వివరాల్లోకి వెళితే దుర్గి నుంచి ముటుకూరు వెళ్లే ప్రధాన రహదారి మలుపు వద్ద ఎర్ర మట్టితో రోడ్డు వేసినప్పటికీ చిన్న వర్షానికి బురదమయమై విద్యార్థులు, స్త్రీలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజులుగా చిన్నపాటి జల్లులు పడుతున్న దృష్ట్యా రోడ్డు మొత్తం బురదై పాదచారులు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురై అదుపుతప్పి బురదలో పడిపోతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అటుగా వెళ్లే ముటుకూరు, కోలగుట్ల, కంచరగుంట, ఉప్పలపాడు, వెల్దుర్తి గ్రామ ప్రజలు ఇక్కడకు చేరుకునే సరికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకొని రోడ్డును బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు. మండల ప్రజాప్రతినిధులు, ఆర్ అండ్ బీ అధికారులు చొరవచూపి ఈ దుస్థితి నుంచి విముక్తి కల్పించాలని.. రాబోవు రోజుల్లో ఎక్కువ వర్షాలు కురిసే అవకాశమున్నందున ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. –దుర్గి

చేతుల పరిశుభ్రతపై అవగాహన

బెల్లంకొండ: విద్యార్థులు చిన్నతనం నుంచే పరిశుభ్రతను అలవర్చుకోవాలని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు కేవీ కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భోజనానికి ముందు, భోజనం తర్వాత తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవడాన్ని అలవర్చుకోవాలని సూచించారు. హాస్టల్లో దోమల వ్యాధి నిరోధించటానికి కిటికీలకు మెష్ ఏర్పాటు చేయాలని, విద్యార్థులు పడుకునే ముందు పొడవాటి దుస్తులు ధరించాలన్నారు. హాస్టల్ పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో యాంటీ లార్వా ద్రావణాన్ని పిచికారీ చేయించాలని సూచించారు. జలుబు, దగ్గు చిన్నచిన్న రుగ్మతలతో బాధపడుతున్న విద్యార్థులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్యుడు కోటేశ్వరరావు

'శిక్షా సప్తాహ్' ఆటల పోటీలు

సత్తెనపల్లి: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని హెచ్ఎం అనురాధ అన్నారు. శిక్ష సప్తాహ్‌లో భాగంగా పట్టణం, మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం క్రీడా దినోత్సవంను పురస్కరించుకొని వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రైలుపేటలో నిర్వహించిన క్రీడల్లో ఆమె మాట్లాడారు. చిన్నతనం నుంచే విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ సందర్భంగా బాల, బాలికలకు వేర్వేరుగా ఖోఖో, పరుగు పందెం పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.